చెత్త తరలింపులో జాప్యం..

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకానగర్ డివిజన్‌లో పారిశుద్ధ్య విభాగం వారు రోడ్లపై చెత్త కనబడకుండా తీసుకుంటున్న చర్యలు బాగుంటునాయని సర్కిల్‌లోని ప్రజలు అంటున్నారు. కానీ ఇంటింటికీ వచ్చి స్వచ్ఛ ఆటో ద్వారా చెత్తను సేకరించే విధానంలో కొన్ని లోపాలు ఉండటం వల్ల రోడ్లపై, చౌరస్తాల్లో కొంత మంది చెత్త వేస్తున్నారని సంక్షేమ సంఘాల నేతలు అంటున్నారు.

ఇళ్లలో పేరుకుపోతున్న చెత్త

చెత్త సేకరించే స్వచ్ఛ ఆటోల వారు రోజు విడిచి రోజు చెత్త సేకరణకు ప్రతి ఇంటికీ రావాల్సి ఉండగా చాలాసార్లు రెండు, మూడు రోజులకు ఒకసారి రాకపోవడం వల్ల ఇళ్లలో చెత్త పేరుకు పోతోందని, అదేవిధంగా స్వచ్ఛ ఆటో ఆపరేటర్లు అపార్టుమెంట్‌లో కంటే వ్యాపార సంస్థల వద్ద చెత్త సేకరణకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది సింగిల్ బెడ్ రూమ్‌లో అద్దెకు ఉండే చిన్న కుటుంబాల వారితో పాటు గ్రామాల నుంచి చదువుకోవడానికి రూమ్‌లు అద్దెకు తీసుకుని నివసించే వారు చెత్త సేకరణకు ప్రతినెలా రూ.100 ఫీజు చెల్లించే స్తోమత లేక తమ ఇంట్లోని చెత్తను ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. దీంతో రోడ్లపై విపరీతంగా చెత్త పేరుకుపోతోంది. సింగిల్ రూమ్‌లో అద్దెకు ఉండే చిన్న కుటుంబాల వారికి రూ.50 వసూలు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి ఉప్పల్ సర్కిల్ ఎస్‌డబ్ల్యూ ఎండీఈఈ సీహెచ్ చందన, ఫోన్ నంబర్: 97013 63239.

శిథిలావస్థలో ఓపెన్ జిమ్



రామంతాపూర్: డివిజన్ పరిధిలో చిన్న చెరువు గ్రౌండ్‌లో నాలుగు సంవత్సరాల క్రితం జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో చెరువు ప్రాంగణంలో వాకింగ్‌కు వచ్చే మహిళలతో పాటు పలువురు వ్యాయామం చేసేవారు. కానీ ప్రస్తుతం ఈ ఓపెన్ జిమ్ పరికరాలు ఎక్కడికక్కడే విరిగి పోయాయి. పనికి రాకుండా మారాయి. వెంటనే ఈ ఓపెన్ జిమ్‌లో నూతన పరికరాలు ఏర్పాటు చేసి జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి ఆంజనేయులు ఉప్పల్ సర్కిల్ డీసీ ఫోన్ నంబర్: 91547 96619

రహదారి నిర్మాణమెప్పుడు..?

మల్కాజిగిరి: మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. దెబ్బతిన్న రహదారి స్థానంలో నూతన రహదారి నిర్మాణం కోసం ఆరు నెలల క్రితం రహదారి తవ్వారు. రహదారి నిర్మాణం కోసం కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ గతంలో రావాల్సిన బిల్లులు, బకాయిలు ఉండటంతో రహదారి నిర్మాణం నిలిపేశాడని స్థానికులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని శుక్రవారం ట్రాన్స్‌పోర్ట్ ఆటో బోల్తా పడిందని, కొద్దిలో డ్రైవర్‌కు ప్రమాదం తప్పిందని స్థానికుడు మహ్మద్ తెలిపాడు. ఇప్పటికైనా స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.



బోల్తా పడ్డ ట్రాన్స్‌పోర్ట్ ఆటో

యోగాతో మధుమేహానికి చెక్



మల్కాజిగిరి: మధుమేహం నివారణకు యోగా ఉపయోగపడుతుందని భారతీయ యోగా సంస్థాన్ హైదరాబాద్ పశ్చిమ జిల్లా అధ్యక్షుడు చింతా హరినాథ్‌రెడ్డి అన్నారు. మౌలాలి జెడ్‌టీసీ ట్రైనింగ్ సెంటర్‌లో మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవన విధానంలో ఆహారం, అలవాట్లు వ్యాధులకు గురి చేస్తున్నాయని, ముఖ్యంగా రక్తపోటు, మధుమేహంతో ఎక్కువ మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆహార అలవాట్లు మార్చుకొని యోగా, ధ్యానంతో వాటిని నియంత్రించడమే కాకుండా, నిర్మూలించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. యోగా శిక్షకురాలు కిరణ్ పటేల్ పలు సూచలను శిబిరంలో తెలియజేశారు. శిక్షణ తరగతుల్లో ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ శర్మతో పాటు సుమారు 59 మంది పాల్గొన్నారు.

నూతనంగా బాక్స్ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలి



కాలనీ సమస్యపై పరమేశ్వర్‌రెడ్డితో చర్చిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ ప్రధాన రోడ్డు నుంచి జనప్రియ, భవానీనగర్ పెద్ద బాక్స్ డ్రైనేజీ వరకు నూతనంగా బాక్స్ డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేస్తే మురుగు, వరద నీరు సాఫీగా సాగుతుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి అన్నపూర్ణ కాలనీ సలహాదారులు శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. గురువారం పరమేశ్వర్‌రెడ్డికి బాక్స్ డ్రైనేజీ లైన్ కోసం శ్రీకాంత్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులకు వినతి పత్రం అందజేశామని గుర్తు చేశారు. వరద, మురుగు నీరు సాఫీగా వెళ్లకపోవడంతో కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరుతోందన్నారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు.

నేటి నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ కనకరాజుతోట(శంకర విద్యా పీఠం)లో శుక్రవారం నుంచి హన్మత్ జయంతి ఉత్సవాలు జరుగుతాయని హన్మత్ పీఠం వ్యవస్థాపకులు ఘంటసాల సత్యసాయి తెలిపారు. శుక్రవారం కలశస్థాపన, గణపతి హోమం, మన్యు సూక్త హోమం, సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం, శనివారం హనుమత్ జయంతి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణం, సాయంత్రం 6 గంటలకు 27 నక్షత్ర జప, శాంతిహోమం, చివరి రోజు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి కోటి రామనామ జప పూర్ణాహుతి హోమం, సాయంత్రం సీతారామ కల్యాణంతో కార్యక్రమం ముగుస్తుందని ఆయన తెలిపారు.


పేదలు సీఎంఆర్‌ఎఫ్‌ను వినియోగించుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌కు చెందిన మల్లేష్ యాదవ్‌కు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1,50,000 మంజూరయ్యాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం మంజూరు పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజలు తమ చికిత్సలకు అయ్యే ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత గంధం నాగేశ్వరరావు, పవన్, చాంద్ పాషా, షోరూమ్ శంకర్, పాపిరెడ్డి, ఆనంద్, టోని తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలని వినతి



మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతి అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కాచవానిసింగారం, దివ్యనగర్, సుప్రభాత్ ఫేస్ 1, 2, 3 కాలనీలకు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ద్వారా మంచి నీటి వసతి కల్పించాలని నగరంలోని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఖైరతాబాద్ కార్యాలయంలో మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డికి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి గురువారం వినతి అందజేశారు. ఓఆర్ఆర్ లోపలి గ్రామాల్లో వందలాది కుటుంబాలు నీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి మంచినీటి వసతి కల్పించాలని లేఖలో కోరారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలు



ఉప్పల్‌లో సీఐటీయూ ఆవిర్భావ వేడుకల్లో నేతలు



నాచారం పారిశ్రామికవాడలో సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

ఉప్పల్: ఉప్పల్‌లో ఘనంగా సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకున్నారు. చిలుకానగర్ చౌరాస్తాలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న మాట్లాడుతూ ఐక్య పోరాటం అనే నినాదంతో కార్మికులను కలుపుకుని 54 ఏళ్ల నిర్విరామంగా కృషి చేసిందన్నారు. కార్మికులు పక్షాన నిలబడి పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, శివ, శేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సీఐటీయూ

మల్కాజిగిరి: కార్మికులకు అండగా సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని మల్కాజిగిరి మండల కార్యదర్శి నర్సింగరావు అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేశారు. నర్సింగరావు మాట్లాడుతూ 54 సంవత్సరాలుగా కార్మికులు, కర్షకుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ వారికి అండగా ఉంటున్నామన్నారు. సంఘటితంగా ఉండి పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సీఐటీయూ బలోపేతానికి కార్మికులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుమిత్ర, నాగమణి, స్వప్న, బాలయ్య, రాజు, యాదగిరి పాల్గొన్నారు.



సీఐటీయూ జెండా ఆవిష్కరణ

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

మల్లాపూర్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.గణేష్ ఆధ్వర్యంలో నాచారం పారిశ్రామికవాడలో ఘనంగా నిర్వహించారు. పారిశ్రామికవాడలోని మెక్ డోవెల్, యూనిటెడ్ స్పిరిట్ కంపెనీ వద్ద సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కార్మికుల కోసం సీఐటీయూ పోరాటం మాత్రమే చేస్తోందన్నారు. కార్మికుల రాజ్యం వచ్చినప్పుడే కార్మికులకు నిజమైన వేతనాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎండీ అబ్దుల్లా, రాజ్‌కుమార్, ప్రకాష్, శ్రీహరి, శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, పరమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, వెంకట నారాయణరెడ్డి, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలి



ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీస్తున్న ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధుల బృందం

ఉప్పల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉప్పల్ మండల పరిధిలో పలు పాఠశాలు సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీశారు. పాఠశాలల్లో టాయిలెట్స్, తాగు నీటి వసతి, తరగతి గదుల్లో టేబుల్స్ కూడా లేవని బృందం గుర్తించింది. 2024–25 విద్యా సంవత్సరం మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న సందర్భంగా విద్యాశాఖ, పాలకులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించినప్పుడే డ్రాప్ అవుట్స్ తగ్గుతాయని బృందం అభిప్రాయపడింది. బడి బాటకు ముందే వసతులు కల్పించే ప్రయత్నం చేయాలని వారు కోరారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విలఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ సేవలు

ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రంలో మినీ హబ్, అల్ట్రాసౌండ్ సేవలను గురువారం జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డా.టి. రఘునాథ స్వామి ఉప వైద్యాధికారి ఎస్. నారాయరావుతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే అల్ట్రాసౌండ్ స్కాన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి బుధ, శుక్ర, శనివారం అల్ట్రాసౌండ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డా.పి.పద్మావతి, సౌందర్యలత తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 19 వరకు బడిబాట

- తల్లిదండ్రులు ,టీచర్లు, ప్రజలను భాగస్వామ్యం చేయాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి

సాక్షి, మేడ్చల్ జిల్లా: వచ్చే నెల 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి కోరారు. మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో బడిబాట కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 3న గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. 4న ప్రతి ఇంటిని సందర్శించి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు గ్రామస్థాయి రిజిస్టర్‌లో పేరు నమోదు చే యించాలన్నారు. 5 నుంచి 10 తేదీ వరకు బస్తీ , పల్లెల్లో గడప గడప ప్రచారం చేయటంతోపాటు అంగన్వాడీ సెంటర్లలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు బడిబాటపై కరపత్రాలు, బ్యానర్లు, పాఠశాలల్లో ఏర్పాటు చేయటంతోపాటు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని సూచించారు. 11న గ్రామ సభలు నిర్వహించి, బడిబాట కార్యక్రమాన్ని సమీక్షా సమావేశాలను నిర్వహించాలన్నారు. 12న పాఠశాల సుందరీకరణతోపాటు పండుగ వాతావరణం నెలకొల్పి, తల్లిదండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేసి, అమ్మ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేయబడిన పనులను ప్రారంభించాలన్నారు. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేయాలని వివరించారు. 13న విద్యార్థులతో పుస్తకపఠనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. 14న పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం, బాల సభలు ఏర్పాటు చేయాలని సూచించారు. 15న అంగవైకల్యం కలిగిన విద్యార్థులను భవిత సెంటర్లలో చేర్పించాలని చెప్పారు. అలాగే, బడిబాటలో నమోదు చేయబడిన బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, 18న విద్యార్థులకు డిజిటలైజేషన్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఇంగ్లిష్ మీడియం బోధనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. 19న విద్యార్థులకు పలు క్రీడలను నిర్వహించటంతోపాటు వారందర్ని క్రీడల్లో భాగస్వామ్యం చేయాలన్నారు.

ఘనంగా మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



నాచారంలో మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకల్లో యూత్ కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను గురువారం నాచారంలో మాజీ సైనికుడు, తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మామిడాల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు యోగేశ్వర్‌రెడ్డి, లోకేంధర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, సతీష్, ట్రిబుల్ ఎస్ యువసేన ప్రతినిధులు ఆరెల్ల శ్రీధర్, చందునాయక్, ఆలేటి శ్రీకాంత్, జావీద్, రాజు, ఆలేటి గణేష్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సక్రమ విధులతో క్షయ నిర్మూలన

సాక్షి, మేడ్చల్ జిల్లా: డాక్టర్లు, వైద్య సిబ్బంది విధులను శ్రద్ధగా నిర్వహించటం ద్వారా క్షయవ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం హాలులో ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని అభిషేక్ కోరారు. క్షయవ్యాధి నిర్మూలన కోసం వయోజనులకు బీసీజీ టీకా వేసేందుకు వైద్యారోగ్య శాఖ చేపడుతున్న మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. క్షయ వ్యాధి బాధిత కుటుంబాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వేను పలు జాగ్రత్తలతో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులతో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, పేదలకు అందుతున్న వైద్యసేవలపై ఆయన మాట్లాడటంతోపాటు వారితో కొద్దిసేపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి, డెమో అంజయ్య, పలువురు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశానికి ముందు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథ స్వామితో కలిసి వైద్యుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేటి నుంచి శ్రీ విష్ణు శివాలయ దేవస్థానం బ్రహ్మోత్సవాలు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రిలో అక్కన్న మాదన్న హయాంలో నిర్మించిన అతిపురాతన శ్రీ విష్ణు శివాలయ దేవస్థానం 38వ కల్యాణ మహోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 31న (నేడు) సుప్రభాత సేవతో గోపూజ, విష్ణేశ్వరపూజ, ధ్వజారోహణం, మంతపారాధన, నాదస్వనగోష్ఠి, స్వామి వార్లకు అభిషేకం అలంకరణం, హారతి, తీర్థ ప్రసాధ వితరన ఉంటుందన్నారు. 1న తీర్థశ్రీ వీరాంజనేయ స్వామి వారికి సింధూర అభిషేకం, అనంతరం కల్యాణోత్సవములు, అన్నదానం ఉంటుందని వివరించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11కేవీ రాంరెడ్డినగర్ ఫీడర్, వైజయంతి ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజీ, ఎర్రకుంట, అంబేడ్కర్‌నగర్, కమలాబాయి నగర్, హనుమాన్‌నగర్, సావర్కర్‌నగర్, రాంరెడ్డినగర్ కమాన్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, శ్రీరాంనగర్ కాలనీ, కౌండిన్యనగర్, వైజయంతి థియేటర్ మెయిన్ రోడ్, రవీంద్రనగర్, సాయినగర్‌కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 11 శాంతి గార్డెన్ ఫీడర్, సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతి గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్, ఇందిరానగర్, రాఘవేంద్రనగర్, కాంక్రీట్ ప్లాజా అపార్ట్‌మెంట్స్, అన్నపూర్ణకాలనీ, రాఘవేంద్రనగర్, సాయినగర్, పార్ట్, రవీంద్రనగర్ పార్ట్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

ఫీడర్ మరమ్మతుల కారణంగా..

రామంతాపూర్: విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు భరత్‌నగర్, గాంధీనగర్, ఓల్డ్ రామంతాపూర్, శ్రీనగర్ కాలనీ, శాంతినగర్, రాజేంద్రనగర్, ఆనంద్‌నగర్, దూరదర్శన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు హోమియోపతి కాలేజ్ దూరదర్శన్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని ఏఈ రాములు కోరారు.

11 కేవీ ఉదయ్‌నగర్ ఫీడర్ పరిధిలో..

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11 కేవీ ఉదయ్‌నగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. సరస్వతినగర్, విజయపురి కాలనీ, ఉదయ్‌నగర్, శ్రీలక్ష్మినగర్, ఆకృతి టౌన్‌షిప్ కేశవనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు గాయత్రినగర్, ద్వారకానగర్ ఫేస్–1, 2లో, సాయంత్రం 3.30గంటల నుంచి 5 గంటల వరకు లక్ష్మినగర్, సాయిమారుతీనగర్, కేశవనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సంజయ్‌నగర్‌కు చెందిన వేణుమాధవ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2,50,000 ఎల్‌వోసీ పత్రాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎస్‌వీ.సతీష్‌కుమార్, శ్రీరామ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ముత్యాలమ్మకు మొక్కులు తీర్చుకున్న సునీతమహేందర్‌రెడ్డి



అల్వాల్ తోట ముత్యాలమ్మ ఆలయంలో కొబ్బరికాయలతో మొక్కులు తీర్చుకుంటున్న సునీతమహేందర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరుతూ అల్వాల్ ముత్యాలమ్మ వారికి పూజలు చేశానని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి అన్నారు. అల్వాల్ తోట ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో గురువారం అల్వాల్ రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ తోట దశమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై అమ్మవారికి 1,116 కొబ్బరికాయలతో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా దశమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని అమ్మవారికి మొక్కుకున్నానన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించిన రేవంత్‌రెడ్డి అమ్మవారి ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి అయ్యారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, కిషన్ పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, భోజిరెడ్డి, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే ఫిర్యాదు చేయాలి



అల్వాల్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన

అల్వాల్: సైబరాబాద్ షీ టీమ్ ఆధ్వర్యంలో గురువారం అల్వాల్‌లో మహిళల భద్రత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలు తమపై జరిగే వేధింపులను మౌనంగా భరించాల్సిన అవసరం లేదని, టీజింగ్, వేధింపులపై డయల్–100, హాక్ ఐ మొబైల్ యాప్, షీ టీమ్. సైబరాబాద్‌జీమెయిల్, సైబరాబాల్ పోలీస్ ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చంద్రమోహన్, వెంకటేష్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కొర్రెముల్‌లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు



ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామపంచాయతీ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఉన్నతాధికారులు ఎన్నికల బిజీలో ఉండగా అదను చూసి అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అక్రమ కట్టడాలను నిలుపుదల చేయడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యూష కాలనీ, వైభవ్ కాలనీ, బాలాజీనగర్‌లో పలువురు రెండస్తులకు అనుమతి తీసుకొని మూడు, నాలుగు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన సిబ్బందిని బెదిరిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన పెద్ద నాయకులు తమకు తెలుసని, వారితో మాట్లాడతావా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యాలయం సిబ్బంది మిన్నకుండిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను నిలుపుదల చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీఓ రవిని వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై సమాచారం లేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో ఉన్నానని, అవి పూర్తి కాగానే అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657